

ఎమ్మెల్యే, ఎంపీల ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానిక నేతలు

# ఫ్లెక్సీ చిచ్చు!

- ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద మంత్రుల ప్రెస్‌మీట్‌కు ఏర్పాట్లు
- ఫ్లెక్సీలో కనిపించని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలు
- ఆలస్యంగా గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు
- అప్పటికే ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు
- చివరకు ప్రెస్‌మీట్ రద్దు చేసుకున్న అమాత్యులు

హనుమకొండ సబర్బన్, మార్చి 18 : నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఫలితంగా మంత్రులు తాము పాల్గొనాల్సిన ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-3లో భాగంగా దేవన్నపేట వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌ను బుధవారం మంత్రులు ప్రారంభించేందుకు షెడ్యూల్ ఖరారైంది. అయితే అనూహ్యంగా మంగళవారమే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించేందుకు వస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం వచ్చింది. ప్రారంభ కార్యక్రమం పూర్తయిన తర్వాత నీటి డెలివరీ సిస్టర్న్‌ను పరిశీలించి, అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద మంత్రుల ప్రెస్‌మీట్‌కు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో ప్రెస్‌మీట్ వేదిక వద్ద అధికారులు ఏర్పాటు చేయగా, అందులో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ఫొటోలు ముద్రించలేదు. దీనిని గుర్తించిన 'నమస్తే తెలంగాణ' ఫొటోలు తీసుకుంటుండగా తప్పును గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించారు. అప్పటికే ప్రెస్‌మీట్ సమయం దగ్గరపడడంతో మిన్నకుండిపోయారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సైతం అక్కడే ఉన్నప్పటికీ జరిగిన తప్పిదాన్ని గుర్తించలేకపోయారు. ఈ విషయం అక్కడున్న కాంగ్రెస్ కార్యకర్తలకు చేరడంతో పలువురు వేదిక పైకి ఎక్కి ఫ్లెక్సీని చూపిస్తూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. వేదికకు ఇరువైపులా ఉన్నా కార్యకర్తలు, నాయకులు సైతం నీటి పారుదలశాఖ అధికారులు నిద్ర పోతున్నారా? మా సారు ఫొటోనే మర్చిపోతారా? అంటూ నిలదీశారు. వేదిక వద్ద జరుగుతున్న ఫ్లెక్సీ రగడ దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద ఉన్న మంత్రుల బృందానికి చేరినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామంలోకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ ఫొటోలు తీసుకొచ్చి ఫ్లెక్సీపై అతికించే ప్రయత్నం చేశారు. కాగా అప్పటికే ఇక్కడి పరిస్థితి తెలుసుకున్న మంత్రులు ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. అలాగే ఫ్లెక్సీలో కేవలం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాత్రమే స్వాగతం పలికినట్లు పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వచ్చినప్పటికీ ఆయన ఫొటో చిన్నగా వేసి పేరు ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, మంత్రుల ప్రెస్‌మీట్ సమాచారంతో మధ్యాహ్నం 3.30 గంటలకే ధర్మసాగర్ రిజర్వాయర్ వద్దకు వెళ్లిన పాత్రికేయుల కోసం ఒక్క కుర్చీ కూడా వేయకపోవడం విమర్శలకు దారితీసింది. అలాగే తాగునీటి ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో విలేకరులు ఇబ్బంది పడ్డారు.

## అధికారులపై మంత్రుల ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రులు

ప్రతిష్టాత్మక దేవాదుల ఫేజ్-3 పనుల్లో జాప్యం, రైతులకు నీటి విడుదలలో తలెత్తుతున్న సమస్యలపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు ప్రచురితమవుతున్నాయి. ఈ క్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దేవాదుల ఫేజ్-3లో ఒక పంపును ప్రారంభించేందుకు నీటిపారుదలశాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి మంగళవారం దేవన్నపేటకు వచ్చారు. అక్కడే అధికారులతో అంతర్గత సమావేశం ఏర్పాటు చేసి పంప్‌హౌస్ నిర్వహణ, పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిట్స్ బుక్ నిర్వహణతో పాటు ఇతర పనులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఏర్పాట్లలో విఫలమయ్యారని చివాట్లు పెట్టారు. అలాగే, ఫ్లెక్సీ వివాదంలో పలు శాఖల అధికారులకు గట్టిగా క్లాసు పీకినట్లు తెలుస్తున్నది.



- కూలీలకు గొడుగు నీడ..

భానుడి భగభగలకు జనం అల్లాడుతున్నారు. రోజువారీ కూలి పనులకు వెళ్లే వారు ఎండతాపం నుంచి రక్షణ కోసం గొడుగులను వెంట తీసుకెళ్తున్నారు. చిన్నగూడూరు మండల కేంద్రం శివారులోని చేపూరితండా వద్దగల చిన్నగూడూరు-మహబూబాబాద్ రహదారి పక్కన కొందరు కూలీలు మిర్చికాయలు ఏరేందుకు వెళ్లారు. ఓ పక్క విపరీతమైన ఎండ.. మరోపక్క మిర్చిఘాటుతో సతమతమవుతూ ఇలా గొడుగు నీడన మిర్చిఏరుతూ కెమెరాకు చిక్కారు.

– చిన్నగూడూరు, మార్చి 18



- జలం లేక జీవాలకు..

ఆకేరు వాగులో నీటి లభ్యత తగ్గిపోవడంతో పరిసర ప్రాంతాల్లో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన గడిల సాయిలు తనకున్న ఐదు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. పంట చివరి దశలో నీళ్లందక ఎండిపోగా, పంటను కాపాడుకోలేక, ఎటూ దిక్కుతోచక చివరికి పొలం మొత్తాన్ని గొర్రెలు మేపుకునేందుకు ఇచ్చానని ఆవేదనతో తెలిపాడు. గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ ఆ వాగు అడుగంటలేదని, ఈ సంవత్సరం మాత్రం పూర్తిగా ఎండిపోయిందని తెలిపారు. –తొర్రూరు మార్చి 18

- అర్హుల జాబితాలో ఉన్నా అందని ప్రొసీడింగ్స్
- ఒక్కో పథకానికి ఒక్కో కొర్రీ పెట్టి ఎగవేత
- ప్రజలపై పగబట్టిన రేవంత్ సర్కారు
- రామవరం గ్రామంలో 'నమస్తే తెలంగాణ' పర్యటన



రామవరం గ్రామం

దిక్కుతోచని స్థితిలో పైలట్ గ్రామాల లబ్ధిదారులు

# అర్హత ఉన్నా.. పథకాలు సున్నా!

### రుణమాఫీ కాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రూ. 2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని చెప్పింది. ఇప్పటి వరకు నాకు రుణమాఫీ కాలేదు. నేను పెద్దముప్పారం ఎస్బీఐలో రుణం తీసుకున్న. 2018లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రూ. లక్ష రుణమాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 1.30 లక్షల రుణం ఇప్పటి వరకు మాఫీ కాలే. రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి నాకెందుకు చేయలేదో చెప్పాలె. బ్యాంకు అధికారులను అడిగితే ప్రభుత్వం ఎప్పుడు డబ్బులు వేస్తే అప్పుడు మాఫీ చేస్తామంటున్నరు.

–వైద చిన్న సోమయ్య, రైతు, రామవరం, దంతాలపల్లి మండలం

మహబూబాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటి అమలులో మాత్రం తాత్సారం చేస్తున్నది. ఎప్పుడెప్పుడు రేవంత్ ప్రభుత్వం పథకాలు ప్రారంభిస్తుందోనని ఎదురుచూస్తున్న ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతున్నది. కొద్ది నెలల క్రితం పథకాల అమలు కోసం మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పైలట్ గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితాలు చదివి, అందులో కొద్దిమందికి మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఒక్కో పథకానికి ఒక్కో కొర్రీ పెడుతూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారు. ఈ క్రమంలో 'నమస్తే తెలంగాణ' పైలట్ గ్రామమైన జిల్లాలోని దంతాలపల్లి మండలం రామవరంలో పర్యటించి పథకాల అమలు విషయమై వాస్తవ వివరాలు సేకరించింది. గ్రామంలో మొత్తం 199 ఇండ్లు, 536 జనాభా ఉంది. ఇక్కడ మొత్తం 150 మంది రైతులుండగా కేవలం 80 శాతం మందికే రైతు భరోసా వచ్చింది. మిగిలిన 20 శాతం మంది బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని వాపోతున్నారు. 50 మంది వ్యవసాయ కూలీలుండగా ఇందులో కేవలం 15 మందికి ఆత్మీయ భరోసా ఇచ్చి మిగిలిన 35 మందికి ఎగనామం పెట్టారు. గ్రామంలో 20 మంది రైతులకు పలు కొర్రీలు పెట్టి రుణమాఫీ ఎగ్గొట్టారు. ఇందిరమ్మ ఇండ్లకు 99 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు కేవలం 29 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇండ్ల మోడల్‌పై అధికారులు అవగాహన కల్పించిన అనంతరం ప్రొసీడింగ్స్ తీసుకున్న 20 మంది నిర్మాణానికి వెనకడుగు వేశారు. మిగిలిన 9 మంది కూడా అనేక అనుమానాలతో పనులు ప్రారంభించలేదు. ఇందిరమ్మ అండ్లకు చాలా మందికి అర్హత ఉన్నా రేషన్ కార్డు లేదని ఇవ్వలేదు. రేషన్‌కార్డుల కోసం వంద మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, కేవలం 20 మందికి మాత్రమే వచ్చాయి. మిగిలిన 80 మందికి ఆధార్‌కార్డుకు ఫోన్‌నంబర్ లింకు లేదని, పెళ్లి కాక ముందు తండ్రి పేరు మీదున్న కార్డులో ఉన్నారని, అందులో డిలీట్ చేసుకుంటే కొత్తది ఇస్తామంటూ తప్పించుకుంటున్నారు. ఇలా ఒకదానికి ఒకటి కొర్రీ పెట్టి పథకాలకు అర్హత ఉన్నా ఎగ్గొడుతున్నారు.

### మంజూరు పత్రం ఇచ్చిండ్రు.. ఇప్పుడు రాదంటుండ్రు



నాకు గత జనవరి 26న గ్రామ సభలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ చేతుల మీదుగా ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని మంజూరు పత్రం ఇచ్చిండ్రు. ఇల్లు కట్టుకుందామని అధికారుల వద్దకు వెళితే జాబితాలో నీ పేరు లేదని చెప్పిండ్రు. మంజూరు పత్రం ఇచ్చిన 15 రోజులకు మా ఊరు కారోబార్ వచ్చి పంచాయతీ కార్యదర్శి సారు నీకు ఇచ్చిన మంజూరు పత్రం ఇవ్వమంటున్నడని చెప్పి తీసుకెళ్లాడు. నా ముగ్గురు పిల్లలతోటి పెంకుటింట్లో ఉంటున్న. వానొస్తే కురుస్తున్నది. నీ పేరు మీద 20 ఏండ్ల కిందట సిమెంట్ తీసుకున్నట్లు ఉంది.. అందుకే ఇల్లు ఇవ్వమని అధికారులు అంటున్నరు. నేను గతంలో ఎప్పుడు సిమెంట్, ఇందిరమ్మ ఇల్లు తీసుకోలేదు. సిమెంట్ ఇచ్చామనే వంకతో ఇల్లు తీసేశారు.

–శోభ, లబ్ధిదారురాలు, రామవరం, దంతాలపల్లి మండలం



గ్రామ పంచాయతీ కార్యాలయం

## వెంకట్రావుపల్లెలోనూ అరకొరే..

- నిధుల లేమితో నిలిచిన అభివృద్ధి
- రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలు

వర్ధన్నపేట : వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావుపల్లె (పాత బొక్కలగూడెం)ను ప్రభుత్వం పైలట్ గ్రామంగా ఎంపిక చేసింది. ఈ గ్రామంలో పర్యటించిన 'నమస్తే తెలంగాణ'తో వివిధ పథకాల లబ్ధిదారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇక్కడ మొత్తం జనాభా 941 మంది కాగా, ఇందులో 769 మంది ఓటర్లున్నారు. ఈ చిన్న గ్రామంలో అధికారులు సర్వే నిర్వహించి ఇండ్లు, రేషన్ కార్డులులేని పేదలను గుర్తించారు. వీరికి నాలుగు సంక్షేమ పథకాలు అందించాల్సి ఉండగా అరకొరగానే అమలు చేస్తున్నారు. గ్రామంలోని 30 మంది పేదలు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, మరో 20 మంది మార్పులు, చేర్పుల కోసం అర్జీ పెట్టుకొని ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. అలాగే ఇంటి స్థలాలున్న పేదలు 23 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవడంతో అందరికీ మంజూరు చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ గత నెలలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధికారులు వచ్చి కేవలం నలుగురికే ముగ్గులు పోశారు. అయితే వారి ఇండ్ల నిర్మాణ పనులు కూడా ఇంకా ప్రారంభం కాలేదు. కాగా, పైలట్ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని, అన్ని పథకాలు 100 శాతం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే వెంకట్రావుపల్లెలో నెలవారీగా అయ్యే ఖర్చులతో పాటు పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. ఏడాదిగా రాష్ట్ర సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో పైలట్ గ్రామాలతో పాటు అన్ని ఊళ్లలో అభివృద్ధి నిలిచిపోయింది. నిధుల లేమితో గ్రామాల్లో పలు పనులు చేసేందుకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు నానా అవస్థలు పడుతున్నారు.



వెంకట్రావుపల్లె జీపీ కార్యాలయం, (ఇన్‌సెట్) పల్లెప్రకృతివనం

**పచ్చని వనంపై గొడ్డలి వేటు పడింది.** పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచే లక్ష్యంతో తీరొక్క మొక్కలు, ఆకట్టుకునే చెట్లతో గత బీఆర్‌ఎస్ సర్కారు నర్సంపేటలోని శాంతినగర్‌లో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటుచేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నామరూపాల్లేకుండా చేస్తున్నది. ఎన్నో ఏండ్ల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పూలు, పండ్ల మొక్కలు, 15 కానుగ, 123 టేకు చెట్లు కలిపి 300 చెట్లు సర్కారు నిర్లక్ష్యం, అధికారుల అనాలోచిత నిర్ణయానికి నేలకొరిగాయి. ప్రకృతి వనాల అభివృద్ధికి గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తే రేవంత్ సర్కారు మాత్రం వాటిని నిర్దాక్షిణ్యంగా కొట్టేయడంపై ప్రజలు భగ్గుమంటున్నారు. ఎలాంటి ప్రకటన గానీ, ఆన్‌లైన్ టెండర్ లేకుండానే వేలం వేసి వ్యాపారులతో నేలమట్టం చేయించి విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుచేసే నిర్ణయంపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది.

- నర్సంపేట, మార్చి 18



వ్యాపారులు కట్ చేసి తీసుకెళ్లిన పెద్ద పెద్ద టేకు చెట్లు

### విద్యుత్ సబ్ స్టేషన్ కోసమే!

ఇదిలా ఉండగా ఈ ప్రభుత్వ భూమిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికార పార్టీ ముఖ్య నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా జనావాసాల నడుమ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రమాదకరమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదం పంచే ప్రకృతి వనాన్ని తొలగించడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఇదే శాంతినగర్ ఫిల్టర్ బెడ్ సమీపంలో ప్రభుత్వ భూమి అనువుగా ఉన్నదని, అక్కడ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు.

# ప్రకృతి వనంపై గొడ్డలి వేటు

- ప్రజలకు కరువైన స్వచ్ఛమైన వాతావరణం
- గత ప్రభుత్వ లక్ష్యానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు
- 30 ఏళ్ల నాటి టేకు చెట్లు నేలమట్టం
- ఆ స్థానంలో సబ్ స్టేషన్ నిర్మాణంపై తీవ్ర వ్యతిరేకత



ఐదు రోజుల ముందు చెట్లతో కళకళలాడుతున్న పట్టణ ప్రకృతి వనం(ఫైల్)

బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పట్టణ ప్రకృతి వనాలను శ్రీకారంచుట్టింది. ఈ క్రమంలో నర్సంపేటలోని ద్వారకపేట-శాంతినగర్ 7వ వార్డులో పట్టణ ప్రకృతి వనం కోసం సర్వే నంబర్ 219లో 30గుంటల గ్రీన్‌ల్యాండ్ ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. అప్పటికే 30 ఏళ్ల క్రితమే అందులో కొన్ని టేకు మొక్కలు నాటగా పెరిగి పెద్దవయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది. పార్క్‌లో అన్ని రకాల సౌకర్యాలను మెరుగుపర్చింది. ప్రతీ రోజు వందలాది మంది ఎంతోమంది ఈ వనంలో సేద తీరుతుంటారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. అలాగే మొక్కల నిర్వహణ బాధ్యతను మున్సిపల్ శాఖకు అప్పగించగా సిబ్బంది వాటి సంరక్షణ చర్యలు చేపట్టింది. ఇలా గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఫలాలు అందే స్థాయికి వచ్చాయి. ఈ వనంలో టేకు, కానుగతో పాటు వివిధ రకాల పూల మొక్కలను ఎక్కువగా పెట్టగా 123 టేకు చెట్లు, 15 కానుగ చెట్లతో పాటు 30 ఏండ్ల నాటి చెట్లు అన్నీ కలిపి 300 దాకా ఉన్నాయి. ఏండ్ల తరబడి మున్సిపాలిటీ సిబ్బంది మొక్కలను పెంచి పెద్దచేశారు. వేసవి కాలంలో మొక్కలకు నీరందించేందుకు సిబ్బంది పడరాని పాట్లు పడ్డారు. అయితే గత ఐదు రోజులుగా ఈ చెట్లన్నింటినీ కొందరు వ్యాపారులు నరికి వేస్తుండడంతో ప్రకృతి వనం నామరూపాల్లేకుండా పోతున్నది.

### పేపర్ ప్రకటన, ఆన్‌లైన్ టెండర్ లేకుండానే టేకు మొక్కల వేలం..

అధికారులు తూతూ మంత్రంగానే టేకు మొక్కల వేలం నిర్వహించినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు పేపర్ ప్రకటన చేయకుండా, ఆన్‌లైన్ టెండర్ లేకుండానే వేలం నిర్వహించినట్లు తెలుస్తున్నది. మున్సిఫల్ కార్యాలయ తీర్మానంతో పాటు గిర్దావర్ పంచనామా రిపోర్టు ఆధారంగా కార్యాలయ నోటీస్ బోర్డుపై వేలం ప్రకటన ఉంచగా కార్యాలయ పని నిమిత్తం వచ్చిన ఒకరిద్దరితో వేలం ముగించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తహసీల్దార్ పేపర్ ప్రకటన చేసి టెండర్ నోటీసులు జారీ చేసి వ్యాపారులు పాల్గొనేలా చూడాల్సి ఉంటుంది. ఆ తర్వాత బిడ్‌కు యాక్షన్ టెండర్ నిర్వహించాల్సి ఉంటుంది. యాక్షన్‌లో ఎక్కువ పాట పాడిన వ్యాపారికి అధికారులు టెండర్‌ను అప్పగిస్తారు. ఇవేమీ కాకుండానే మూడు శాఖల అధికారులు తమ నోటీస్‌బోర్డులపై టెండర్ విషయాలు పెట్టి అక్కడికి వచ్చిన ఒకరిద్దరితో గంపగుత్తగా వేలం పాట నిర్వహించడాన్ని పలువురు పట్టణ ప్రముఖులు అధికారుల పని తీరును తప్పు పడుతున్నారు. సుమారు రూ.5లక్షల పైగా రావాల్సిన టెండర్ వేలాన్ని లక్ష వరకే సరిపెట్టుకున్నారని పలువురు చెబుతున్నారు.

### ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నాం

సర్వే నంబర్ 219లో 30గుంటల ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నాం. ఈ స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిస్తాం. అన్ని అనుమతులు పద్ధతి ప్రకారమే తీసుకున్నాం. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు మున్సిపల్‌లో తీర్మానం జరిగింది. శాంతినగర్ ఫిల్టర్ బెడ్ సమీపంలోని స్థలం సబ్ స్టేషన్ నిర్మాణానికి అనువుగా లేదనే, పట్టణ ప్రకృతి వన స్థలాన్ని ఎంపిక చేశాం.

– రాజేశ్, నర్సంపేట తహసీల్దార్

## ఇన్‌స్టాలో పరిచయం చేసుకొని.. గంజాయి అలవాటు చేసి..

### మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి

- వ్యభిచార రొంపిలో దింపేందుకు యత్నం
- పోలీసుల అదుపులో ఆరుగురు సభ్యుల ముఠా
- కారు, రూ. 75 వేల నగదు, గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

సుబేదారి, మార్చి 18 : ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికను పరిచయం చేసుకొని ట్రాప్ చేసి గంజాయి మత్తుకు అలవాటు చేశారు. ఆపై కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడడమే కాకుండా వ్యభిచార రొంపిలో దింపేందుకు యత్నించింది ఓ ముఠా. తమకు అందిన ఫిర్యాదుతో పోలీసులు కిడ్నాప్ కేసును ఛేదించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, కారు, రూ.75 వేల నగదు, 1.800 కిలోల గంజాయి, కండోమ్స్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్ నిందితుల అరెస్ట్‌ను చూపించి, వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ నెల 11న బాలిక మిస్సింగ్ కేసు నమోదు కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ముస్కు లత పడుపు వృత్తి చేసేది. ఈ క్రమంలో తల్లిదండ్రులు లేని ఓ బాలికను పరిచయం చేసుకొని తన ఇంటి వద్ద ఉంచుకున్నది. సులభంగా డబ్బులు సంపాదించాలంటే మైనర్ అమ్మాయిలను ట్రాప్ చేసి వ్యభిచార రొంపిలోకి దింపాలని బాలికకు చెప్పింది. సదరు బాలిక పథకం ప్రకారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికలను పరిచయం చేసుకోవడానికి ప్లాన్ చేసింది. ఇందులో భాగంగా తొలుత వరంగల్ నగరంలో పరిచయం ఉన్న బాలికను ట్రాప్ చేయడానికి ప్రయత్నించగా కుదురలేదు. మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ పరిధిలోని బాధిత బాలికను ఇన్‌స్టాలో పరిచయం చేసుకొని, స్కూల్‌కు వెళ్లే క్రమంలో కలుస్తూ దగ్గరైంది. ఈ క్రమంలో మైనర్ నిందితురాలు వరంగల్ నగరం శంభునిపేటకు చెందిన తన ప్రేమికుడు అబ్దుల్ అఫ్నాన్‌తో బాధిత బాలికకు బట్టలు కొనిచ్చి, అతడి ద్వారా గంజాయి మత్తుకి అలవాటు చేసింది. ఈ నెల 11న మైనర్ నిందితురాలు బాలికను ఇంటినుంచి బయటకు రప్పించి, అబ్దుల్ అఫ్నాన్‌తోపాటు శంభునిపేటకు చెందిన షేక్ సైలానీబాబా, మహ్మద్ అల్తాఫ్ సాయంతో కారులో ఎక్కించుకొని, మీర్జా ఫైజ్ బేగ్ వద్ద గంజాయి కొని నర్సంపేటకు వెళ్లారు. అక్కడ షేక్ సైలాని బాబాకు చెందిన పాత ఇంటికి తీసుకెళ్లి బాలికకు గంజాయి తాగించారు. మత్తులోకి వెళ్లిన తర్వాత సైలానీ బాబా లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత లైంగికదాడి చేస్తుండగా వీడియోలు తీశామని, తాము చెప్పినట్లు చేయాలని, ఈ విషయం ఎవరికైనా చెబితే వీడియో బయటపెడతామని బాధిత బాలికను బెదిరించి, ములుగు రోడ్డు వద్ద వదిలేసి వెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పక్కా సమాచారం మేరకు ప్రధాన నిందితురాలు ముస్కు లత, మైనర్ నిందితురాలు, అబ్దుల్ అఫ్నాన్, షేక్ సైలానీ బాబా, అల్తాఫ్, మీర్జాఫైజ్‌బేగ్‌ను అరెస్ట్ చేసి, గంజాయి, కారు, నగదు, సెల్‌ఫోన్లు, 4,300 కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులపై పాత కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సైలు శ్రీకాంత్, సురేశ్, సిబ్బందిని సీపీ అభినందించారు.




ముఠాఅరెస్ట్‌ను చూపి వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్ ప్రీత్‌సింగ్